

## నేడు ఉమ్మడి జిల్లా జిమ్నాస్టిక్స్ పోటీలు

**ప్రజాశక్తి-తిరుపతి సిటి**

తిరుపతి జిల్లా జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 2వ తేది ఆదివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా జిమ్నాస్టిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టరు వై.ప్రవీణ్, శివప్రసాద్ తెలిపారు. స్థానిక ఆ సంఘం కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు (ఉమ్మడి చిత్తూరు జిల్లా) చెందిన జిమ్నాస్టిక్ క్రీడాకారులు ఆదివారం ఉదయం 9 గంటలకు తిరుపతి యూత్ హాస్టల్ వేదికగా జరిగే క్రీడా పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. అర్టిస్ట్ క్, రిథమిక్, ఏరోబిక్ పోటీలు నిర్వహిస్తామని, ఇందులో గెలుపొందిన వారికి ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు, బహుమతులు అందజేస్తామన్నారు. ఇందులో విజేతలు త్వరలో జరగబోవు రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్ పోటీలకు అర్హులైన, జిమ్నాస్టిక్ క్రీడాకారులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9505873777 పోన్ నెంబరును సంప్రదించాలని కోరారు.

## 14-30 తేదీల్లో వామపక్షాల ప్రచార ఉద్యమం

**ప్రజాశక్తి-తిరుపతి సిటి**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 14 నుంచి 30వ తేది వరకు రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార ఉద్యమాన్ని చేపడుతున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళీ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు హరినాథ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మురళి తెలిపారు. తిరుపతి బైరాగిపట్టెడలోని సిపిఐ కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను కొల్లగొడుతోందని, రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని విమర్శించారు. దేశ సంపదను అదానిలాంటి వ్యక్తులకు కట్టబెడుతూ ప్రభుత్వ సంస్థలను నరేంద్రమోడి నిర్వీర్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాజ్యాంగాన్ని రద్దు చేసి మనువాదాన్ని తెరపైకి తీసుకువచ్చే కుట్ర చేస్తున్నారన్నారు. ఇడి, సిబిఐ సంస్థలను మోడి తన గుప్పెట్లో పెట్టుకుని 300 అక్రమ కేసులు బనాయించారని, ఇందులో కేవలం 9 కేసుల్లో మాత్రమే శిక్ష పడిందని తెలిపారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారని, లొంగిపోతే వారిపై కేసులు కొట్టేస్తున్నారని ఎద్దేవా చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యవసర ధరలతో పాటు గ్యాస్, డీజల్, పెట్రోల్ ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నిత్యావసరాలు అందించి, దేశానికే ఆదర్శంగా నిలిచిందని గుర్తు చేశారు. నిత్యం దళితులపై దాడులు పెరుగిపోతున్నాయని, దాడులు చేసి సోషల్ మీడియాలో వీడియోలు పెడుతున్నా వారిపై చర్యలు తీసుకోలేదన్నారు. ఈ ప్రచార యాత్రలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, ఎస్ఎఫ్ఐ నాయకులు మాధవ్, సిపిఐ నాయకులు పి.మురళీ, చిన్నం పెంచులయ్య, రాధాకృష్ణ, నదియా తదితరులు పాల్గొన్నారు.

## 'చలో ఢిల్లీ'కి నేతలు పయనం

**ప్రజాశక్తి- వరదయ్యపాలెం**

'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి భాష పిలుపునిచ్చారు. శనివారం ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక కర్షక హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాస్తుందని అందుకు వ్యతిరేకంగా ఈ కార్యక్రమాన్ని సిపిఎం ఆధ్వర్యంలో మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతనంగా 25 వేల రూపాయలు ,పెన్షన్ 10వేల వరకు ఇవ్వాలని, హాని కలిగించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలిని కోరారు. నాయకులు చను, మస్తాన్ పాల్గొన్నారు.

**శ్రీకాళహస్తిలో...** కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 5న తలపెట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి శ్రీకాళహస్తి ప్రాంత సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శనివారం తరలి వెళ్లారు. సుమారు 20 మంది సభ్యులతో కూడిన ఈ బందం శ్రీకాళహస్తి నుంచి గూడూరుకు, గూడూరు నుంచి రైలు మార్గంలో దేశ రాజధాని ఢిల్లీకి చేరుకుంటుంది. అంగేరి పుల్లయ్య, షరీఫ్, దాసరి జనార్ధన్, గంధం మణి, పెనగడం గురవయ్య, వేణు, రాజా, గురవమ్మ తదితరులు ఉన్నారు.

## వామ్మో... ఏప్రిల్...!

### ఎండలే కాదు.. ధరలూ మండుతాయ్..!

ప్రజా'దృష్టి'

**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో**

ఏప్రిల్ నెల వస్తుందంటే ఎండలు మండుతాయని అందరికీ తెలిసిందే. అయితే ఈ ఏడాది ఏప్రిల్ నెల ఎండలతో పాటు ధరలూ మండనున్నాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న విధానాల వల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలు మూడు పూటలా తినే పరిస్థితి లేదు. ప్రతి ఒక్కరిపైనా పన్నుల భారం పడనుంది. ఏప్రిల్ 1 నుంచి ఏ వస్తువు ధర చూసినా ఆకాశాన్ని అంటనుంది. ఎల్ఇడి టివిలు, బట్టలు, మొబైల్ ఫోన్లు, బొమ్మలు, కెమెరా లెన్స్, ఎలక్ట్రికల్ కారులు, డైమండ్ నగలు, నూనె, ఎలక్ట్రికల్ వాహనాలు తదితరాల ధరలు ఈ ఏడాది కేంద్రం ప్రకటించిన బడ్జెట్‌లో పెరిగాయి. కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణల వల్ల ఇకపై ప్రతినెలా వినియోగదారునికి 'షాక్' కొట్టనుంది. గతంలో ఆంధ్రప్రదేశ్ రెగ్యులారిటీ కమిషన్ ఏడాదికోసారి ప్రజాభిప్రాయాన్ని సేకరించి అనుగుణంగా నిర్ణయాలు చేసేది. అయితే ఇకపై రాష్ట్రం చేతిలో ఆ పరిస్థితి లేదు. ఏ నెలకానెల సర్దుబాటు ఛార్జీలు పెంచుకునేలా డిస్కంలకు అవకాశం ఇచ్చింది. టోల్‌గేట్‌లు సైతం వినియోగదారులపై భారం వేయనున్నాయి. ఈ టోల్‌గేటుల భారం ఆర్టీసిపైన పడటం వల్ల మరింత భారం కానుంది. ఈ నష్టాలను పూడ్చుకునేందుకు ప్రయాణికులపై భారం వేసే అవకాశం లేకపోలేదు. జగన్ ప్రభుత్వంలో ఉద్యోగులకు ఇప్పటికే నెలనెలా జీతాలొచ్చే పరిస్థితి లేదు. ప్రజాపంపిణీ వ్యవస్థ నిర్వీర్యం అయిపోయింది. ఇంటి వద్దకే రేషన్ ఇస్తామని ప్రగల్భాలు పలికిన ప్రభుత్వం, వాహనాల సిబ్బందికి రెండు నెలలుగా జీతాలివ్వకపోవడం, డీజిల్ ధరలు వేయకపోవడంతో ఏప్రిల్‌నెల నుంచి రేషన్ బియ్యం ఇవ్వలేమని, తమకు భారమయ్యిందని ఇప్పటికే వారు తేల్చి చెప్పేశారు. ఇక గ్యాస్, పెట్రోల్ ధరలు షరా మామూలే. ఏదిఏమైనా కార్పొరేట్లకు లక్షలాది కోట్లు రాయితీలు ఇస్తూ, పేదలపై భారం మోపుతున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని సాగనంపడమే ధ్యేయంగా వామపక్షాలు ఉమ్మడిగా ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి పురస్కరించుకుని 'ప్రజా చైతన్య యాత్ర'లను గ్రామగ్రామాన చేపట్టనున్నట్లు వెల్లడించింది. దాదాపు నెలరోజుల పాటు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వేస్తున్న భారాలు, రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ తీరు ఎండగడుతూ ప్రచారం చేయనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శులు వెల్లడించారు.

## ఆక్షేపణలు ఉంటే సిలికా తవ్వకాలు రద్దు

**ప్రజాశక్తి - చిల్లకూరు**

గ్రామస్తుల నుంచి ఆక్షేపణలు ఉంటే సిలికా తవ్వకాలను రద్దు చేస్తామని ఎంఎల్ఎ వరప్రసాద్ భరోసా ఇచ్చారు. చిల్లకూరు మండల పరిధిలోని బల్లోలు గ్రామ పంచాయతీలోని చిన్న సన్నకారు రైతులు గూడూరు నియోజకవర్గ ఎంఎల్ఎ వరప్రసాద్‌ను శనివారం కలిసి తమ గోడు వినిపించారు. ఓ సిలికా యజమాని సుభద్రారెడ్డి గ్రామస్తులపై కేసులు పెడుతూ మహిళా రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఆమె వేధింపులు భరించలేక చెరుకూరు ఆదిలక్ష్మమ్మ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. ఎంఎల్ఎ స్పందిస్తూ గ్రామానికి సంబంధించిన పోరంబోకు భూములు రైతులు సాగు చేసుకుంటున్నా, పట్టా భూములపై రైతులకే

### గ్రామస్తులకు ఎంఎల్ఎ భరోసా

అధికారం ఉంటుందన్నారు. అనంతరం కలెక్టర్‌తో, గూడూరు డిఎస్‌పితో, చిల్లకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌తో, మైనింగ్ ఏడీతో, జియాలజిస్ట్‌తో మాట్లాడి గ్రామస్తులపై కేసులు పెట్టరాదని ఆదేశాలిచ్చారు. ఎంఎల్ఎకు తమ గోడు వినిపించేందుకు దాదాపు వందమంది రైతులు విచ్చేశారు.

**సిలికా యజమానులకు దిశ ఛైర్మన్ హెచ్చరిక**

చిల్లకూరు మండల పరిధిలోని బల్లోల గ్రామ ప్రజలను దిశ యాక్ట్ ఛైర్‌పర్సన్ వీడిగుంట అరుణ పరామర్శించారు. శనివారం చిన్న సన్నకారు రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సిలికా యజమాని సుభద్రరెడ్డి ఆగడాలపై ఆమెకు వివరించారు. తమపై కేసులు పెట్టి నానా దుర్భాషలాడి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. అరుణ మాట్లాడుతూ 'మీ పంట పొలాలోల మీరే సాగు చేసుకునేందుకు అవకాశాలు కల్పిస్తాం' అని హామీ ఇచ్చారు. మీపై కేసులు పెట్టిన వారిని పొలాల్లోకి రానీకుండా చేస్తామని స్పష్టం చేశారు.

## మున్సిపల్ కమిషనర్ల వైఖరి మార్చుకోవాలి

### యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిమాండ్

**ప్రజాశక్తి - గూడూరు టౌన్**

మున్సిపల్ కార్మికుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న మున్సిపల్ కమిషనర్లు తమ వైఖరి మార్చుకోవాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్‌చేశారు. తిరుపతి జిల్లా గూడూరు, వెంకటగిరి, నాయుడుపేట మున్సిపాలిటీల్లో పారిశుధ్య సిబ్బందికి మూడునెలలుగా జీతాలు ఇవ్వలేదని, జీతాలతో పాటు, సూళ్లూరుపేటలో పనిముట్లు లేవని, సెలవులు, ఇపిఎఫ్, ఇఎస్ఐ సమస్యలన్నింటినీ సకాలంలో పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అరవై ఏళ్లు దాటి రిటైర్ అయిన వారికి, ఇటీవల కాలంలో చనిపోయిన వారి కుటుంబాల్లో పిల్లలకు ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలన్నారు. శనివారం గూడూరులోని సిఐటియు కార్యాలయం నుంచి పారిశుధ్య కార్మికులు పెద్దఎత్తున ప్రదర్శనగా వచ్చి ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఆర్డీవోతో చర్చలు జరిగాయి. 2005 నుంచి పిఎఫ్, ఇఎస్ఐ సంబంధించిన లెక్కలు మున్సిపాలిటీలో లేవని, 2019లో జూన్, జులై హెల్త్ అలవెన్స్‌లు ఇప్పటివరకూ చెల్లించలేదని, ఇప్పటికీ ఏడుగురు కార్మికులకు సంబంధించి పది నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వారి పేర్లను ఆప్కాస్‌లో ఎక్కించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. మున్సిపల్ కమీషనర్లు కార్మికుల పట్ల చులకన భావంతో వ్యవహరిస్తున్నారన్నారు. గూడూరు ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారు. సమస్యలు సానుకూలంగా పరిష్కరించని యెడల 14 రోజుల తరువాత

మొత్తం అన్ని మున్సిపాలిటీల్లో కార్మికులు కలిసి సమ్మెలోకి వెళతామని యూనియన్ నేతలు హెచ్చరించారు. చర్చల్లో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, తిరుపతి జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి బి.గోపీనాథ్, అధ్యక్షులు జి.రాజగోపాల్, గూడూరు సిపిఎం కార్యదర్శి జోగి శివకుమార్, నాయకులు బివి రమణయ్య, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్, ఎస్.సురేష్, పిపి మురళి రాగయ్య, ప్రసాద్, మణి, సాయి, పెంచల ప్రసాద్, సంపూర్ణమ్మ, శుభరత్నమ్మ, సుబ్బమ్మ, పెంచలమ్మ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యంకు సన్మానం

**తిరుపతి టౌన్ :** 'స్థానిక' సంస్థల ప్రజా ప్రతినిధుల నుండి ఎమ్మెల్సీ ఎన్ని కలలో ఏకగ్రీవంగా ఎన్నికైన తిరుపతి రష్ హాస్పిటల్ అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంను శనివారం వినియోగదారుల సంఘం అధ్యక్షుడు పి రాజారెడ్డి శాలువాతో సన్మానం చేశారు. రాజారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ వత్తిలో ఉన్న సిపాయి సుబ్రహ్మణ్యం ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం సంతోషకరమని అన్నారు.

## ప్రాణాలతో వ్యాపారం

### తీరుమారని 'అంబులెన్స్' మాఫియా

**ప్రజాశక్తి - గూడూరు**

**గూడూరు నుంచి నెల్లూరుకు 40 కిలోమీటర్లు. మృతదేహాన్ని సొంతూరుకు తీసుకెళ్లేందుకు పదివేలు ప్రైవేట్ అంబులెన్స్‌వారు తీసుకుంటున్నారు. మామూలుగా 3-5వేల మధ్య తీసుకోవాల్సి ఉంది.**

**గూడూరులో యాక్సిడెంట్ జరిగింది. విజయవాడకు మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు 50వేలు వసూలు చేశారు.**

అంబులెన్స్ మాఫియా ఆగడాలు యధాతథంగా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల వాళ్లు చెప్పిందే ఫైనల్ రేటు. ఎంత అడిగితే అంత ఇవ్వాల్సిందే. వాళ్లు అడిగినంత ఇవ్వకపోతే ఇక రోగి ప్రాణాలు ఇక అంతే సంగతులు. ప్రైవేట్ అంబులెన్స్ మాఫియా రోగులను, పేదలను రాబందుల్లా పీక్కు తింటోంది. ఏదైనా అమానవీయ ఘటనలు జరిగినపుడు మాత్రమే అంబులెన్స్ మాఫియాపై ప్రభుత్వం స్పందిస్తోంది.

తిరుపతి జిల్లా గూడూరులో మృతదేహాన్ని తరలించేందుకు వేల రూపాయలు డిమాండ్ చేసి, బాధితులపై దౌర్జన్యం చేసిన అంబులెన్స్ డ్రైవర్లపై గతంలో పోలీసులు కేసులు నమోదు చేశారు. కలెక్టర్ సమగ్ర దర్యాప్తుకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలలో రంగంలోకి దిగిన గూడూరు ఆర్డీవో ప్రభుత్వాసుపత్రి దగ్గర విచారణ చేపట్టారు. అంబులెన్స్ మాఫియా ఆగడాలు నిజమేనని నిర్ధారించుకుని నివేదిక సిద్ధం చేశారు. గూడూరు ఆర్డీవో ఫిర్యాదుతో అంబులెన్స్ ఓనర్స్‌పై పలు సెక్షన్ల కింద అప్పట్లోకేసులు నమోదు చేశారు. గూడూరు ప్రభుత్వాసుపత్రి ఆర్ఎంఒ, సూపరింటెండెంట్‌పై ఆర్డీవో రిపోర్టు ఇచ్చారు. ఆస్పత్రి ఆవరణలోనే ఈ తతంగమంతా జరుగుతున్నా వైద్యసిబ్బంది చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నది వాస్తవం. జిల్లా వైద్యాధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అప్పట్లో తెగ ఆర్భాటం చేసిన అధికారులు, ఆ తరువాత ఏం చర్యలు చేపట్టారో ఇప్పటికీ తెలియదు. ఆ కేసులు ఏమయ్యాయన్నది తెలియాల్సి ఉంది. అయితే ఇప్పటికీ గూడూరు ప్రభుత్వాసుపత్రి దగ్గర అంబులెన్స్ మాఫియా తీరు మారలేదని రోగులు వాపోతున్నారు.

## కరోనాతో పెరిగిన భక్తిభావం

### ప్రతినెలా రూ.100 కోట్లపైనే హుండీ ఆదాయం

**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో**

కరోనా తర్వాత చాలా రంగాల్లో మార్పులుచేర్పులు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. కీలకమైన రంగాల్లో మార్కెట్ వాల్యూ భారీగా పెరిగింది. ఈ క్రమంలో చూసుకుంటే, ప్రజల్లో భక్తిభావం కూడా కాస్త పెరిగినట్టు కనిపిస్తోంది. గడిచిన ఏడాదిగా శ్రీవారి హుండీ ఆదాయం ప్రతి నెలా వంద కోట్ల రూపాయలు దాటడమే దీనికి ప్రత్యక్ష ఉదాహరణ.

గత ఏడాది ఏప్రిల్ నుంచి శ్రీవారి హుండీ ఆదాయం ప్రతి నెల క్రమం తప్పకుండా వంద కోట్ల మార్క్‌ను క్రాస్ చేస్తోంది. ఏడాదిగా భక్తులు స్వామివారికి భారీగా కానుకలు, హుండీలో డబ్బులు సమర్పిస్తున్నారు. అలా 2022-23 ఆర్థిక సంవత్సరంలో కేవలం హుండీ ద్వారానే టీటీడీకి 1520.29 కోట్ల రూపాయల ఆదాయం సమకూరింది.గత నెల మార్చిలో కూడా శ్రీవారికి హుండీ ద్వారా 120.29 కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. నిన్నటి (మార్చి 31) ఆదాయంతో కలిపి ఈ లెక్కల్ని విడుదల చేసింది టీటీడీ.ఈ ఆర్థిక సంవత్సరమే అత్యధికం.. ప్రతి ఆర్థిక సంవత్సరం హుండీ ఆదాయాన్ని టీటీడీ బయటపెడుతుంది. అలా ఈ ఆర్థిక సంవత్సరం లభించిన ఆదాయమే అత్యధికం. ఇప్పటివరకు ఏ ఆర్థిక సంవత్సరంలో టీటీడీకి ఈ స్థాయిలో హుండీ ఆదాయం రాలేదు. ఇక నెలవారీగా చూసుకుంటే.. గతేడాది ఆగస్ట్ లో అత్యధికంగా హుండీ ద్వారా 140.34 కోట్ల రూపాయల ఆదాయం సమకూరినట్టు అధికారులు ప్రకటించారు. కరోనాకు ముందు అప్పుడప్పుడు కొన్ని నెలల్లో మాత్రం శ్రీవారి హుండీ ఆదాయం వంద కోట్ల రూపాయలు దాటేది. కానీ గతేడాది మార్చి నుంచి ప్రతి నెల 100 కోట్ల రూపాయలకు పైగా హుండీ ద్వారా ఆదాయం లభిస్తోంది

## దివ్యదర్శనం టోకెన్లు జారీ ప్రారంభం

**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో**

తిరుమల నడకమార్గాల్లో దివ్యదర్శనం టోకెన్ల జారీని టీటీడీ శనివారం ఉదయం నుండి పున్ణ ప్రారంభించింది. కోవిడ్ నేపథ్యంలో గత మూడు సంవత్సరాలుగా టీటీడీ దివ్యదర్శనం టోకెన్ల జారీని నిలిపివేసింది. అయితే భక్తుల కోరిక మేరకు అలిపిరి నడక మార్గంలో గాలిగోపురం వద్ద 10 వేలు, శ్రీవారిమెట్టు మార్గంలో 1250వ మెట్టు చెంత 5 వేల దివ్యదర్శనం టోకెన్లను ఏప్రిల్ 1వ తేదీ నుండి కేటాయిస్తున్నారు. భక్తులు నేరుగా తమ ఆధార్ కార్డుతో హాజరైతేనే టోకెన్లు జారీ చేస్తారు. టీటీడీ కొద్దిరోజులపాటు ప్రయోగాత్మకంగా దివ్యదర్శనం టోకెన్ల జారీని పరిశీలించనుంది. భక్తులు ఈ విషయాన్ని గమనించి టోకెన్లు పొందాలని కోరుతోంది.

## వైసిపిలో 'రాజకీయ వారసులు'

**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో**

వైఎస్ఆర్ కాంగ్రెస్‌లో రాజకీయ వారసులు వస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఎంఎల్ఎలు అందరూ ఢిల్లీస్థాయి పదవులు ఆశించడం, వయోభారంతో ఇబ్బందులను దృష్ట్యా తాము ఉండగానే తమ వారసులను రాజకీయాల్లోకి దింపేస్తున్నారు. అధికార పార్టీలో ఈ రాజకీయ వారసులు ఎక్కువగా కనిపించడం గమనార్హం. అధికారం ఉండగానే వారసులను అందలమెక్కించాలని తపిస్తున్నారు. ఇప్పటికే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తాను అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోనని, జగన్‌కు వెన్నంటి ఉంటానని ప్రకటించారు. తన రాజకీయ వారసుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని అందరూ ఆదరించాలని వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి 2024 ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని, 2019 ఫలితాలు వచ్చినపుడే విజయోత్సవ సభలోనే చెప్పారు. ఆ మాటకు కట్టుబడి తన కొడుకు భూమన అభినయ్‌రెడ్డిని డిప్యూటీ మేయర్‌గా రాజకీయ అరంగేట్రం చేయించి 2024 ఎన్నికల్లో బరిలో దింపనున్నారు. ఏప్రిల్ మొదటివారంలో జరిగే మంత్రివర్గ విస్తరణలో శ్రీకాళహస్తి ఎంఎల్ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డికి స్థానం ఉంటుందని చర్చ నడుస్తోంది. అతనికి మంత్రి పదవి ఇస్తే వచ్చే ఎన్నికల్లో బియ్యపు పవిత్రారెడ్డిని బరిలో నిలిపే అవకాశం ఉంది. డిప్యూటీ సిఎం నారాయణస్వామి 70 సంవత్సరాలు పైబడి ఉండడంతో అతని కుమార్తెను రంగంలోకి దింపుతారని చర్చ నడుస్తోంది. ఏదిఏమైనప్పటికీ 'ముందస్తు' ఎన్నికలు జరుగుతాయని చర్చ నడుస్తున్న నేపథ్యంలో రాజకీయ వారసుల ప్రకటన ప్రాధాన్యతను సంతరించుకుంది.

### వైకాపా ఎంఎల్‌ఏలు ఇద్దరు టచ్‌లో ఉన్నారు : టిడిపి

**ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్**

అసంతృప్తితో ఎప్పుడైనా టిడిపిలోకి జంప్ చేసేందుకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇద్దరు ఎంఎల్‌ఏలు పార్టీ అధినాయకత్వంలో టచ్‌లో ఉన్నట్లు టిడిపి జిల్లా అధ్యక్షులు పులివర్తి నాని తెలిపారు. పరిస్థితి అనుకూలిస్తే ఎప్పుడైనా టిడిపిలో చేరేందుకు ఆ ఇద్దరు ఎంఎల్‌ఏలు సిద్ధంగా ఉన్నట్లు శనివారం స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. అలాగే పుట్టపర్తిలో టిడిపి నేతలపై జరిగిన దాడిని తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖడిస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుండీ వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక వైకాపా గూండాలు తెలుగుదేశం నేతలపై దాడులకు తెగబడుతున్నారని, ఎన్ని అడ్డకుంటు సృష్టించినా లోకేష్ పాదయాత్రను అడ్డుకోలేరన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం విజయఢంగా మోగిస్తుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ మేయర్, టిడిపి నగర అధ్యక్షురాలు కఠారి హేమలత నాయకులు మోహన్‌రాజ్, కోదండయాదవ్‌లు పాల్గొన్నారు.

## అధికార పార్టీలో రాజకీయ సంక్షోభం

**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో**

ఇన్నాళ్లూ తమకు ఎదురు లేదని అసెంబ్లీ ఎన్నికల నుంచి స్థానిక, మున్సిపల్ ఎన్నికల వరకూ విజయఢంకా మోగించిన వైసిపికి ఎంఎల్‌సి ఎన్నికలు తీవ్రమైన షాక్‌ను ఇచ్చాయి. సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని నమ్ముకున్న సిఎం జగన్మోహన్‌రెడ్డికి ఎంఎల్‌సి ఫలితాలు దిమ్మతిరిగేలా చేశాయి. దీంతో ఆ పార్టీలో అంతర్మథనం మొదలయ్యింది. ఆయా నియోజకవర్గాల్లో ఎంఎల్‌ఎల అక్రమాలు, ప్రజల్లో పాలన పట్ల వ్యతిరేకత ఎలా ఉందనే విషయాలపై సమీక్షిస్తున్నారు. తిరుపతి నియోజకవర్గంలో ఏదో చేద్దామనుకుని 'ఈ భూములన్నీ మావే' అని 22ఎ ఉత్తర్వులు తెచ్చారు. అయితే ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి అసెంబ్లీ వరకూ తీసుకెళ్లి తాత్కాలికంగా ఉపశమనం కలిగించారు. శాశ్వత పరిష్కారం చూపేవరకూ 22ఎ కత్తి నగర ప్రజలపై వేలాడుతూనే ఉంటుంది. ఇది వైఎస్ఆర్ కాంగ్రెస్‌కు తీవ్రమైన దెబ్బ అని చెప్పవచ్చు. చంద్రగిరి నియోజకవర్గంలో చెవిరెడ్డి పోటీ చేయకుండా తనయుని బరిలో నింపడంపైనా పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గంలో ప్రజలకు ఎన్ని కానుకలు ఇచ్చినా వ్యతిరేకత ఉందని చర్చ నడుస్తోంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ద్వితీయశ్రేణి నాయకులు ఎంఎల్ఎ పేరు చెప్పుకుని భూఆక్రమణలు, భూదందాలు చేపట్టడం ఆ పార్టీ పట్ల సానుకూలంగా లేరు. నగరి మంత్రి ఆర్‌కె రోజా పరిస్థితి గడ్డుకాలమే అని చెప్పవచ్చు. సొంత పార్టీలోనే వ్యతిరేక వర్గం ఉండడంతో ఆమె ఓటమే ధ్యేయంగా పనిచేయనున్నారు. దాంతో పాటు స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఉదాహరణకు 30వేల కుటుంబాలున్న మరమగ్గం కార్మికుల సమస్యలను పట్టించుకోలేదు. అదనపు లోడ్ ఛార్జీలు పెంచాలని దీర్ఘకాలిక ఆందోళన చేస్తే వారిపై కేసులు బనాయించి భయపెట్టే ప్రయత్నం చేశారు. శ్రీకాళహస్తిలో స్థానిక ఎంఎల్ఎ పట్ల వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. ఎంఎల్ఎ పేరు చెప్పుకుని ద్వితీయశ్రేణి నాయకత్వం భూదందాలు, సెటిల్మెంట్ పేరుతో 'కమీషన్లు' ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇటీవల జరిగిన చిందేపల్లి ఘటన సంబంధించి అధికార పార్టీ ఫ్యాక్టరీకి అమ్ముడుపోయిందని గ్రామస్తులే స్వయంగా విమర్శిస్తున్నారు. సత్యవేడు నియోజకవర్గంలో ఆదిమూలంకు అడుగడుగునా వ్యతిరేకతే. సంపాదనే ధ్యేయంగా ఎంఎల్ఎ అనుచరులు పనిచేస్తున్నారని, ప్రజలకు సేవ చేయడం లేదని, ఒక గ్రూపునే ఎంఎల్ఎ ఆదిరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. జీడీనెల్లూరు నియోజకవర్గంలో నారాయణస్వామికి గడ్డుకాలమేనని చర్చ నడుస్తోంది. దళితులు × రెడ్డి సామాజికవర్గంగా అక్కడ 'వార్' నడుస్తోంది. పంతంబూని నారాయణస్వామిని ఇంటికి పంపిస్తామని క్యాడర్ ప్రచారం చేస్తోంది. ఈ వ్యతిరేకతలను మూటగట్టుకున్న పార్టీ సమీక్షించుకుని ఏ విధంగా ముందుకెళు తుందో చూడాల్సిందే.

## పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు

**ప్రజాశక్తి-కోట:** ఏప్రిల్ మూడోతేదీ నుంచి జరగబోవు పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎంఈవో వెంకటసునీల్ కుమార్ అన్నారు. శనివారం కోట ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయన విలేకర్లలో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల కోసం మండలంలో ఐదు పరీక్ష కేంద్రాలను నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నీ సౌకర్యవంతమైన వసతులు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి విద్యార్థి 8.30 గంటలకు పరీక్ష కేంద్రంలో ఉండాలని సూచించారు.

## 6 నుంచి లక్ష్మీ కుబేర మహాయాగం

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** ఈనెల 6 నుంచి 9 వరకు రాయలచెరువు సమీపంలోని శ్రీ శక్తి పీఠం పీఠాధీశ్వరి మాతాజీ శ్రీ రమ్యానంద భారతి ఆధ్వర్యంలో 108 హోమగుండాలతో శ్రీ స్వర్ణాకర్షణ భైరవ సహిత లక్ష్మీ కుబేర మహా యాగాన్ని నిర్వహిస్తున్నట్లు పీఠం మేనేజింగ్ సెక్రటరీ శ్రీకాంత్ తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరోనా కారణంగా ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రుణ బాధలు ప్రజలకు తొలగాలన్న ఉద్దేశంతో ఈ యాగాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్ ను ఆవిష్కరించారు. యాగ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు ఫోన్‌నంబరు 9063701687ను సంప్రదించాలని తెలిపారు.

## అథ్లెటిక్స్‌లో రాణించడానికి ఆర్థికసాయం

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ ఎన్ఏఆర్ఎల్ క్వార్టర్స్‌లో నివాసముంటున్న బాబు, సుకన్యల కుమారుడు ఉయ్యాల మోహన్ హర్ష చైనాలో జరిగే ఏషియన్ గేమ్స్ లో పాల్గొని రాణించడానికి తగిన ఆర్థిక సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హర్ష మాట్లాడుతూ ఏడు సంవత్సరాల వయసులో విద్యుత్‌ఘాతానికి గురై కుడిచేయి సగభాగం కోల్పోయానని, ద్రోణాచార్య అవార్డు గ్రహీత అయిన శిక్షకుడు నాగపూరి రమేష్, తల్లిదండ్రుల సహకారంతో గత ఫిబ్రవరి 27న దుబాయిలో నిర్వహించిన వరల్డ్ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ఫిక్స్‌లో 100 మీటర్ల పరుగులో సిల్వర్ మెడల్ ను సాధించానన్నారు. చైనాలో నిర్వహించే ఏషియన్ గేమ్స్ లో మన దేశానికి బంగారు పతకం తీసుకురావాలని అకుంఠిత దీక్షతో కృషి చేస్తున్నానని, దాతల సహకారం అందిస్తే ఈ విజయం సాధించగలుగుతానని విజ్ఞప్తి చేశారు. ఈ ఏషియన్ గేమ్స్ లో పాల్గొనడానికి రెండున్నర లక్షల నుంచి రూ.పది లక్షల వరకు ఖర్చు అవుతుందన్నారు. బిజెపి జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ అక్కిపల్లి మునికృష్ణ యాదవ్ తనవంతు సహకారంగా హర్షకు 10 వేలు అందించారు. ఈ సందర్భంగా హర్షను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుండాల గోపీనాథ్, సుబ్రహ్మణ్యంరెడ్డి, సుబ్రమణ్యం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాస సేతు పూర్తి ఎప్పటికో..?

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన పాదయాత్ర సమయంలో జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని హామీ ఇచ్చి నేడు యువతను మోసం చేశారని టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్ అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు యువతకు, ప్రజలకు హామీలు ఇచ్చిన జగన్ పార్టీలో ఎన్ని నెరవేర్చారో చెప్పాలనే డిమాండ్ చేశారు. టిడిపి హయంలో రెండు సార్లు డీఎస్సీ నిర్వహించి 18 వేల ఉద్యోగాలు ఇచ్చామని, సీఎం జగన్ ఒక టీచర్ ఉద్యోగమైన భర్తీ చేశారా అని ప్రశ్నించారు. నిరుద్యోగ యువతకు ప్రభుత్వ పనుల్లో కాంట్రాక్టులు ఇస్తానన్న జగన్ ఎన్ని కాంట్రాక్టులు ఇచ్చారో, ఎంతమందిని కాంట్రాక్టర్లుగా తయారు చేశారన్నారు. కమిషన్ల కక్కుర్తితో మూడున్నర ఇళ్లలో 17 లక్షల కోట్ల పెట్టుబడును పొరుగు రాష్ట్రాలకు తరిమేసి 34 లక్షల మంది యువత ఉపాధికి గండి కొట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో సింగంశెట్టి సుబ్బరామయ్య, వేణుగోపాల్ నాయుడు, రుద్రకోటి సదాశివం, మనోహరాచారి పాల్గొన్నారు.

## సత్యకుమార్‌పై దాడి అమానుషం

**ప్రజాశక్తి-కోట:** భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యదర్శి వై.సత్య కుమార్ రాజధాని రైతులను కలిసి వస్తున్న సమయంలో ఆయన వాహనంపై వైసీపీ కార్యకర్తలు దాడి చేయడం అమానుషమని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు సారంగం రమేష్‌బాబు అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను అవగాహన కల్పించే దిశలో ఆయనపై పక్కా ప్రణాళికతో వైసీపీ కార్యకర్తల కక్ష కట్టి దాడికి పాల్పడటం దారుణమైన పరిస్థితి అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి కిరాతకమైన పరిపాలన బిజెపి పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి విశ్వనాథం వాసు, జిల్లా కార్యవర్గ సభ్యులు సత్తెన.అంబరీష్,కిసాన్ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మోర్చా అధ్యక్షులు పరశురాం సాయి, ఉపాధ్యక్షుడు వి.సాయి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు సమస్య పరిష్కరించాలని వినతి

**ప్రజాశక్తి-యర్రావారిపాలెం:** ఎలమంద పంచాయతీలోని గుట్టకిందమాదిగ పల్లె నుంచి గజ్జలవారిపల్లికి వెళ్లే రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ పల్లిపాకు నాగరాజు, ఎంఎస్‌పీ నాయకులు సుండుపల్లి రవి ఆధ్వర్యంలో తహశీల్దారు దస్తగిరికి శనివారం వినతిపత్రం అందించారు. గ్రామాలకు రోడ్డు సమస్య ఉన్నందున ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వాపోయారు. త్వరలోనే రోడ్డు సమస్య పరిష్కరించి రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాదిగపల్లె గ్రామ ప్రజలు లక్ష్మీదేవి, చంద్రమ్మ, సంపూర్ణలక్ష్మమ్మ, రెడ్డమ్మ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న కాలనీలో కల్వర్టు నిర్మాణం

**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** పిళ్లారిపట్టు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు వీలుగా వైసీపీ నాయకులు దేవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో కల్వర్టు నిర్మాణాన్ని చేపట్టారు. అలాగే వర్షానికి నీరు నిలువకుండా జేసీబీ సహకారంతో పనులను ప్రారంభించారు. పనులను పుత్తూరు హౌసింగ్ ఏఈ పరిశీలించారు. కార్యక్రమంలో రామకష్ణాపురం పంచాయతీ కార్యదర్శి మునినరేష్ కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అనుదీప్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## జగనన్న మాటలు శిరసా వహిస్తాం

**ప్రజాశక్తి-క్యాంపస్:** సీఎం జగనన్న ఏమి చెబితే అది శిరసా వహించడం తమ కుటుంబ నేపథ్యం.. తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడం సంతోషంగా ఉందని.. చిన్న వయసులో ఎమ్మెల్యే సీటు కేటాయిస్తారని ఊహించలేదని చంద్రగిరి వైఎస్ఆర్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మోహిత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ ఆయన సేవా గుణాన్ని పుణికిపుచ్చుకుని, సీఎం జగనన్న ఆశయ సాధనకు కృషి చేస్తానన్నారు. 30 ఏళ్లగా వైఎస్ కుటుంబంతో తమ సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. చంద్రగిరి నియోజకవర్గం మొత్తం పాదయాత్ర చేస్తున్నానని..ఇప్పటి వరకు తిరుపతి రూరల్ పరిధిలో 60 రోజులు పాటు పాదయాత్ర చేపట్టానని తెలిపారు. సీఎం జగనన్న, ఎమ్మెల్యే చెవిరెడ్డి పాలనపై ప్రజలు సానుకూల దక్పథాన్ని, ఆప్యాయతను కనబరుస్తున్నారని పేర్కొన్నారు.

# దర్జాగా కబ్జాల వ్యాపారం..!

- ట్రాఫిక్ పరిష్కారానికి రాజకీయాలు అడ్డు
- గూడూరు ఆర్డీవోపై నాయకుల ఒత్తిళ్లు
- ఆందోళనలో కోట పట్టణ ప్రజలు

**ప్రజాశక్తి-కోట:** కోట పట్టణంలో ఆక్రమణల తొలగింపు దశాబ్దాలుగా ప్రజల చిరకాల కల. ఈ కల నెరవేర్చేందుకు గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు అడుగు అడుగునా రాజకీయ నాయకుల అడ్డుపడుతున్నారు. కోటకు చెందిన కొంతమంది వ్యాపారుల్లో వైసీపీ నాయకులు ఉన్నారని కోట ప్రజలు వాపోతున్నారు. గతంలో ఆర్అండ్‌బీ స్థలాలు ఆక్రమించి దొంగ రిజిస్ట్రేషన్లు చేయించుకొని భవనాలు కట్టారు. ప్రస్తుతం కోట ఆక్రమణలపై సర్వే చేస్తే అన్నీ మోసాలు బయటపడ్డాయి. ఆక్రమణ జాబితాపై అభ్యంతరాల కార్యక్రమం ముగించి నోటీసులు జారీ చేసేందుకు అధికారులు సిద్ధం అయ్యారు. దీంతో ఆక్రమణలదారుల వ్యాపారస్థుల్లోని వైసీపీ నాయకుల గుండెల్లో గుబులు రేగింది. నిన్న మొన్నటివరకు గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు వద్ద అధికారులపై ఒత్తిడి చేయించారు. ఆర్డీవో మాత్రం ఆక్రమణల తొలగింపు పై వెనకడుగు వేయలేదు. ఆర్డీవోకి మద్దతుగా స్థానిక వైసీపీ నేతలు నిలిచారు. నిన్న మొన్నటి వరకు మంచి ఊపుపై ఉన్న నేతలు నిన్నటి తో బాగా చల్లపడిపోయి ఇప్పుడు అదే ఆర్డీవోపై ఒత్తిడి మొదలు పెట్టారు. ఆనాడు దివంగత మహానేత నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఆర్అండ్‌బీ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు అభివృద్ధిపై దృష్టి సారించి బ్రిడ్జిలు, రోడ్డులు వేశారు. ముందు చూపుతో బ్రిటిష్ నాటి కాలం మ్యాప్ ప్రకారం రోడ్లు వేశారు. ఆ ముందు చూపు వల్లే నేడు కోట క్రాస్ రోడ్డు, విద్యానగర్, చిట్టెడు, కేశవరం, కడివేడు గ్రామాలు అభివృద్ధి చెందడం జరిగింది. అయితే కోటకు వచ్చే లోపు ఓటు బ్యాంకు రాజకీయం కోసం పూటకో మాట మాట్లాడుతూ కోటను అభివృద్ధి చేయకుండా అడ్డుకుంటున్నారు. కోటలో ఆక్రమణలు అడ్డుకుంటే అభివృద్ధిని అడ్డుకోవడమే. ఇలా అయితే సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు, బుచ్చి అభివద్ధి జరిగి ఉండేవి కావు. కనీసం కోటలో ట్రాఫిక్ సమస్యలతో అల్లాడిపోతున్న కోట ప్రజలుకు అధికారులు, రాజకీయ నాయకులు మంచి రోడ్లపై నడిచే భాగ్యం కల్పించలేకపోవడం దురదృష్టకరమంటున్నారు. కోట బజారులో ఆక్రమణల తొలగింపు ఇప్పుడు జరగకపోతే భవిష్యత్తులో ఇక జరగదనే అపోహ కోట ప్రజల్లో వ్యక్తం అవుతుంది. నిన్నమొన్నటి వరకు అభివృద్ధి అన్న నేతలు నిన్న వ్యాపారస్థులతో సమావేశం పెట్టి ఇప్పుడు అభివృద్ధిని అడ్డుకోవడం వెనుక ఆంతర్యం ఏమిటి?. కోటలో కాలువ కట్టపై ఉన్న గిరిజనులకు ఇంటి స్థలాలు ఇవ్వలేని దుస్థితిలో కోట నాయకులు ఉన్నారు. గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ రాజకీయ నాయకులు మాటలు వినకుండా ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలని.. చరిత్రలో నిలిపోతారని కోట ప్రజలు కోరుతున్నారు.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్

**ప్రజాశక్తి-తిరుచానూరు:** పది పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు తిరుపతి రూరల్ ఎంపీపీ, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మంచి మార్కులు సాధించాలని సూచించారు. శనివారం తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ చేశారు. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో ఈనెల 3వ తేదీ నుంచి పది పబ్లిక్ పరీక్షలు రాయనున్న క్రమంలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. దాదాపు వంద పాఠశాలలో 2,500 మంది విద్యార్థులను పరీక్ష సామాగ్రి అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు పబ్లిక్ పరీక్షల్లో నియోజకవర్గ స్థాయిలో ప్రథమంగా నిలిచిన విద్యార్థులకు ల్యాప్‌టాప్, మండల స్థాయిలో ట్యాబ్‌లను అందజేయనున్నట్లు ఇప్పటికే ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ శేఖర్ విద్యార్థులకు సాయం చేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తనయుడు ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి కతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యశోద, తిరుచానూరు ఎంపీటీసీ నరేష్ , సర్పంచ్ రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయ సంఘ నాయకుడు బొందు సుబ్రమణ్యంరెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి

**ప్రజాశక్తి-దొరవారిసత్రం :** గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సమస్యపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ సూచించారు. శనివారం దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం మండలంలోని వివిధ శాఖల అధికారులు వారి వారి శాఖల అభివృద్ధి వివరాలను చదివి వినిపించారు. మండల ఉపాధ్యక్షులు దువ్వూరు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్య, ఆరోగ్యానికి పెద్దపీట వేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సింగయ్య, ఎంఈవో మస్తానయ్య, అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

## చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

**ప్రజాశక్తి -సత్యవేడు**

ఈనెల 5న కార్మికుల హక్కులకై చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు డివిజన్ కార్యదర్శి రమేష్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ కేంద్రంలోని బీజేపీని నిలదీయలేని స్థితిలో ఉందని.. టీడీపీ సైతం పట్టించుకోవడం లేదన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేకపోతున్నాయని వాపోయారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని తెలిపారు. అనంతరం గోడపత్రికలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు సుబ్రమణ్యం, బాబు , సుధ, తిరుమలై, శీను, వేలు, కృష్ణమూర్తి, మురుగన్, ప్రదీప్, బాబు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

**రేణిగుంట:** 5న జరిగే 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సి.ఐ.టి.యు మండలాధ్యక్షులు నరసింహారెడ్డి, సీనియర్ నేత వెంకటరమణ కోరారు. జి.యం వీధిలోని పుచ్చలపల్లి సుందరయ్య కార్యాలయంలో శనివారం సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో గోడ పత్రికలు ఆవిష్కరించారు. దిలీప్‌బాషా, సత్య శ్రీ, కుప్పస్వామి, నరసింహారెడ్డి, వెంకటరమణ, శివానందం, అమ్ములు, సరిత తదితరలు పాల్గొన్నారు.

## అంతరాష్ట్ర ఎర్రచందనం ముద్దాయి అరెస్టు

### కోటి రూపాయల సొత్తు స్వాధీనం



**ప్రజాశక్తి-తిరుపతి సిటి:** ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న అంతరాష్ట్ర ఎర్రచందనం ముద్దాయిని అదుపులోకి తీసుకుని అతని వద్దనుంచి కోటి రూపాయలు విలువ చేసే 31 ఎర్రచందనం దుంగలు, 2 కార్లు, 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పి పరమేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ తిరుపతి పోలీసులకు అందిన సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం ఎర్రావారిపాలెం మండలం యల్లమంద-ఉస్తికాయల పెంట రోడ్డులో గల యల్లమంద క్రాస్ వద్ద డిఎస్పి నరసప్ప పర్యవేక్షణలో తనిఖీలు చేశారన్నారు. ఈ తనిఖీల్లో పోలీసులు అంతరాష్ట్ర ఎర్రచందనం ముద్దాయిని అదుపులోకి తీసుకున్నారన్నారు. పోలీసులను చూసి మరో ఆరుగురు ముద్దాయిలు పారిపోయారన్నారు. పోలీసులకు తమిళనాడు కృష్ణగిరి జిల్లాకు చెందిన సయ్యద్ సఫీఉల్లా (39) పట్టుబడ్డాడని, తమిళనాడుకు చెందిన గోపినాథ్ పెత్తినాయుడు (38), డి.ఆనందన్ (60) ఎ.గజేంద్రన్ (36), అనుముత్తు(30), హైదరాబాదుకు చెందిన కృష్ణదేవ్ పారిపోయారని తెలిపారు. ముద్దాయి వద్దనుంచి కోటి రూపాయలు విలువ చేసే ఎర్రచందనం, వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడుని చాకచాక్యంగా అదుపులోకి తీసుకున్న సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సమావేశంలో ఎఎస్‌పిలు వెంకట్రావు, కులశేఖర్, విమలకుమారి, డిఎస్‌పి నరసప్ప, సిఐ తులసిరామ్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశాంతంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** తిరుపతి బార్ అసోసియేషన్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని.. అధ్యక్షుడిగా వెంకటకుమార్ ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి గొట్టి రాజేంద్ర తెలిపారు. శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా టి.గోపిచంద్, ప్రధాన కార్యదర్శిగా ఎం. మురళి, సంయుక్త కార్యదర్శిగా గాలి మధుసూదనరావు, మహిళా న్యాయవాదుల కార్యదర్శిగా వైకె. మల్లీశ్వరిదేవి గెలుపు పొందారని తెలిపారు.

## ట్రాఫిక్ స్టేషన్‌కు 25 లక్షల స్పీడ్‌గన్స్ వితరణ

**ప్రజాశక్తి-తిరుపతి సిటి:** తిరుపతి నగరంలో రోజు రోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను నివారించేందుకు స్వర్ణ టోల్‌వే వారు సామాజిక బాధ్యతలో భాగంగా 25 లక్షల రూపాయలు విలువ చేసే స్పీడ్ గన్స్‌ను వితరణగా అందజేశారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఎస్పి పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ తిరుపతి నగరం రోజు రోజుకి విస్తరిస్తోందన్నారు. అదే సమయంలో జనాభా పెరగడంతో పాటు వాహనాల వినియోగం పెరిగిపోయిందన్నారు. స్వర్ణ టోల్ వే వారు స్పీడ్ గన్స్ ఇవ్వడం ఎంతో ఉపయోగకరమన్నారు. ఆదివారం నుంచి వీటిని వాడుకలోకి తీసుకొస్తామన్నారు. ప్రధాన కూడళ్లో, హైవే, జాతీయ రహదారి, సిగ్నల్స్, వన్‌వేలలో వీటిని ఉపయోగించి ప్రమాదాల నివారణకు కృషి చేస్తామన్నారు. సామాజిక బాధ్యతల్లో బాగంగా స్పీడ్ గన్స్ అందజేసిన దాతలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌పిలు వెంకట్రావు, కులశేఖర్, విమలకుమారి, ట్రాఫిక్ డిఎస్‌పిలు కాటమరాజు, విజయశేకర్, స్వర్ణ టోల్‌వే మేనేజరు హరి, దిలీప్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదల భూములను కాపాడాలి

**ప్రజాశక్తి తిరుపతి టౌన్:** తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాలెం మండలం పెద్ద పాండురు పంచాయతీలో ఉన్న సుబ్బానాయుడు కండ్రిగ లోని పేదల భూములను పురావస్తు శాఖ చెర్నై వారి నుండీ కాపాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . శనివారం ఉదయం కలెక్టర్ కార్యాలయం లో సీపీఐ బందం భూ బాధితులతో కలిసి కలెక్టర్ వెంకట రమణా రెడ్డికి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి మాట్లాడుతూ స్థానికులకు 60 సంవత్సరాల క్రితం పట్టాలను ఇచ్చారు. అయితే పురావస్తు శాఖ వారు ఇవి తమ భూములు అని మీరు ఇల్లు, స్థలాలు ,పొలాలు, ఖాళీ చేసి వెళ్లిపోవాలని స్థానికులను వేధిస్తుంటే స్థానికులకు పట్టాలు ఇచ్చినటువంటి రెవెన్యూ అధికారులు, ప్రభుత్వ ఉన్నత అధికారులు పేదల పక్షాన నిలబడకుండా పురావస్తు శాఖ వారికి మద్దతు తెలియజేయడం శోచనీయమన్నారు. ఆ భూములను పేదలు సంవత్సరాలు తరబడి సాగు చేస్తున్నారని, గిరిజనులు 100 కుటుంబాలు ఇల్లు కట్టుకొని జీవిస్తున్నారని, అంగన్వాడి ప్రాథమిక పాఠశాల ఆ భూములలో ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. జగనన్న కాలనీ కూడా ఆ భూములలో ఏర్పాటుచేసి గృహాలు నిర్మించడం జరుగుతోందన్నారు. అయితే ఆ భూములను తమిళనాడు నుంచి వచ్చి తాము పురావస్తు శాఖ అధికారులమని, భూములు ఖాళీ చేయాలని పేదలపై దౌర్జన్యం చేస్తున్నారని అన్నారు. కానీ స్థానిక అధికారులు పేదలకు అండగా నిలబడి వారు ఇచ్చినటువంటి పట్టాలను వారి రికార్డు పరంగా పేదలకు చెందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ వెంకట రమణా రెడ్డి స్పందిస్తూ సూళ్లూరుపేట ఆర్ డి ఓ తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని, అక్కడి పేదలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య , ఎ. చిన్నిరాజ్ , కె. రాధాకష్ణ , గ్రామస్తులు మునస్వామి, ధనుంజయులు, సుబ్రహ్మణ్యం, వసంతమ్మ, తదితరులు పాల్గొన్నారు .

## ఎపిఎస్‌పిడిసిఎల్‌లో ఇంటర్నల్ ఆడిట్

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఎస్ పిడిసిఎల్) పరిధిలో ఈ యేడాది మే నుంచి ఆన్ లైన్ ఇంటర్నల్ ఆడిట్ విధానాన్ని పూర్తి స్థాయిలో అమలులోకి తీసుకురానున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ (ఫైనాన్స్) వి.ఎన్. బాబు పేర్కొన్నారు. తిరుపతిలోని ఎపిఎస్ పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం సంస్థ పరిధిలోని అకౌంట్స్ విభాగపు అధికారులు, ఇంటర్నల్ ఆడిటర్స్, ఆడిట్ అసిస్టెంట్లతో ఎపిఎస్ పిడిసిఎల్ డైరెక్టర్ (ఫైనాన్స్) వి.ఎన్. బాబు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వి.ఎన్. బాబు మాట్లాడుతూ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు ఆదేశాలకు అనుగుణంగా సంస్థ పరిధిలో ఆన్ లైన్ ఇంటర్నల్ ఆడిట్ విధానాన్ని ఏప్రిల్ నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామన్నారు. సంస్థ ఐటి విభాగం రూపొందించిన అప్లికేషన్ ద్వారా సంస్థ పరిధిలోని ప్రతి సర్కిల్లో రెండు ఇఆర్ఓలు (ఎలక్ట్రిసిటీ రెవెన్యూ ఆఫీస్), రెండు ఎక్స్పెండిచర్ యూనిట్లను ఆన్ లైన్ విధానంతో అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్‌పిడిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ కె.ఆర్.ఎస్. ధర్మజ్ఞాని, జనరల్ మేనేజర్లు పద్మ, రవి, సురేంద్రరావు పాల్గొన్నారు.

## వైసీపీ పాలనలో పెరిగిన అప్పులు

**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** పుత్తూరు మున్సిపాలిటీలోని ఎనిమిదో వార్డులో శనివారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఇంటింటికీ వెళ్లి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో అప్పుల ఆంధ్రప్రదేశ్ మారిందన్నారు. కేంద్రం నుంచి వేల కోట్లు నిధులు తెచ్చుకోలేని స్థితిలో ఉన్నారన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచుతూపోతున్న వైసీపీ సర్కారుకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో పుత్తూరు పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్.ఎన్.ధనపాల్, మాజీ మున్సిపల్ ఛైర్మన్లు కరుణాకరన్, యుగంధర్, రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు డీఎస్ గణేష్, మాధవనాయుడు, రఫీ, బాబు, నబీ, వెంకటేష్, ఎంఎస్ బాలాజీ, సోము, ప్రకాష్, అన్నామలై, చీర్ల మోహన్, కుమారవేల్, మోహన పాల్గొన్నారు.

## దత్తత గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ సేవలు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మార్చి 24 నుంచి కళాశాల దత్తత గ్రామాలైన వెంకటాపురం, అన్నాస్వామిపల్లిలో ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు. శ్రమదానం, మొక్కలు నాటడం, ఆటల పోటీలు, కరోనాపై అవగాహన కల్పించామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. సుధాకర్‌రెడ్డి తెలిపారు. జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ టి. చంద్రయ్య, సుజన్ కుమార్, డీన్ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్ రావు, అధ్యాపకులు అంజన్ కుమార్ రెడ్డి, సుధాకర్, విభాగాధిపతులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## పెరుమాళ్లపల్లిలో క్షేత్ర పర్యటన

**ప్రజాశక్తి-క్యాంపస్:** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో సమాజశాస్త్రం చదువుతున్న విద్యార్థులు పది రోజుల క్షేత్ర పర్యటనలో భాగంగా శనివారం పెరుమాలపల్లిలో పర్యటించారు. వైద్యాధికారి సింధుతో సంక్షేమ పథకాలు, ఆరోగ్య విషయాల గురించి చర్చించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు , ఏఎన్ఎంలు, ప్రొఫెసర్ జి.జానకి రామయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ కుసుమ, డాక్టర్ వెంకటేశులు, డాక్టర్ రమణయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో దంపతులకు గాయాలు

**ప్రజాశక్తి-నాగలాపురం:** సచివాలయంలో విధులకు వెళుతున్న దంపతులు రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన శనివారం నాగలాపురంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నందనం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సాయికుమార్, బయ టకొడియంబేడు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శాంభవి దంపతులు ఇద్దరూ కలిసి విధులకు వెళుతున్న సమయంలో నాగలాపురం భారత్ గ్యాస్ సమీపంలో తిరుపతి-చెన్నై హైవే రోడ్డుపై చెన్నై నుంచి తిరుపతికి వెళుతున్న కారు అదుపుతప్పి ఢీకొంది. ప్రమాదంలో దంపతులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో తిరుపతిలోని వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సత్ఫలితాలు ఇస్తున్న మొబైల్ హంట్

**ప్రజాశక్తి-తిరుపతి సిటి:** పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు తిరిగి బాధితులకు అప్పగించేందుకు ఏర్పాటు చేసిన మొబైల్ హంట్ సత్ఫలితాలను ఇస్తోందని జిల్లా ఎస్పి పరమేశ్వరరెడ్డి తెలిపారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు 4వ విడతలో 45 లక్షలు విలువ చేసే 250 మొబైల్ ఫోన్లను ఎస్పి ఆధ్వర్యంలో శనివారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో మొబైల్ ఫోన్ మానవజీవితంలో ఒక భాగమైందన్నారు. అలాంటి విలువైన సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న వారికి రికవరీ చేసి బాధితులకు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. మెరుగైన నైపుణ్యాభివృద్ధిగల సైబర్‌ల్యాబ్ నిపుణులు మొబైల్ హంట్ ద్వారా 9490617873 ఫోన్ నెంబరుకు వచిన ఫిర్యాదులను వెంటనే దర్యాప్తు చేసి సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు అప్పగించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు విడతల వారిగా కోటి 24 లక్షల 50వేల రూపాయలు విలువ చేసే 780 సెల్‌ఫోన్లు బాధితులకు అప్పగించామన్నారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది పనితీరును ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌పిలు కులశేకర్, వెంకట్రావు, విమలకుమారి, సైబర్ ల్యాబ్ సిఐ రామచంద్రారెడ్డి, సైబర్ ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

## సత్యవేడులో మళ్లీ వైసీపీ జెండా ఖాయం

**ప్రజాశక్తి -సత్యవేడు:** రాబోయే ఎన్నికల్లోనూ మళ్లీ సత్యవేడులో వైసీపీ జెండా ఎగరడం ఖాయమని తిరుపతి జిల్లా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శనివారం స్థానిక బేరి శెట్టి కళ్యాణ మండపంలో వైసీపీ మండల కన్వీనర్ సుశీల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజవర్గ స్థాయి మండల, గ్రామ సచివాలయ కన్వీనర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ ఎన్ని సర్వేలు చేసినా మళ్లీ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి అధికార పీఠం ఎక్కడాన్ని ఎవరూ ఆపలేరన్నారు. సచివాలయ కన్వీనర్లు ఇంటింటికి వెళ్లి జగనన్న స్టిక్కర్లు, ,సంక్షేమ పథకాల కరపత్రాలను అందించాలన్నారు. సమావేశంలో నారాయణవనం జడ్పీటిసి సుమన్ కుమార్, ఎంపీపీ దివాకర్ రెడ్డి, సురుటపల్లి ఆలయ చైర్మన్ ఏఎంసి బాలాజీ రెడ్డి, నేతలు చంద్రశేఖర్ రెడ్డి , సోమశేఖర్, హరిశ్చంద్రారెడ్డి, అపరంజి రాజు, విద్యానాథరెడ్డి, భాస్కర్ నాయుడు, శ్యాం ప్రసాద్ రెడ్డి, చిన్న దొరై, మాధవి రెడ్డి, లాల్ బాబు పాల్గొన్నారు.